● చెన్నైలో స్తంభించిన జనజీవనం

మళ్లీ వర్షబీభత్సం


● ప్రమాద స్థాయిలో జలాశయాలు ● 7 జిల్లాలకు వరద హెచ్చరిక


కొరట్టూర్‌లో రోడ్లపై చేరిన వరద నీరు

చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం మన్నార్ జలసంధి తీరం వైపు దూసుకురావటంతో రాష్ట్రమంతటా బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం సాయంత్రం వరకూ భారీ వర్షం కురిసింది. బలపడిన అల్పపీడనం ప్రభావంతో ఈశాన్య రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చటంతో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఓ మోస్తరుగా వర్షాలు కురవనున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తూర్పు హిందూ మహాసముద్రంలో మంగళవారం ఏర్పడిన అల్పపీడనం, బుధవారం బలపడి నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక - తమిళ తీరంమీదుగా పయనించి గురువారం పశ్చిమ వాయువ్య దిశగా తీరం వైపు దూసుకువస్తుండటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉదయం నుంచే వర్షాలు కురిశాయి. కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట జిల్లాల్లో కొన్ని చోట్ల, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ కొన్ని చోట్ల భారీగాను, మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. శివగంగ, రామనాథపురం, తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు, కళ్ళకురిచ్చి, విల్లుపురం, చెంగల్పట్టు, కాంచీపురం, చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో కూడా కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిశాయి. రాజధాని నగరం చెన్నైలో బుధవారం సాయంత్రం తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం రాత్రి తొమ్మిది గంటల తర్వాత ఊపందుకుంది. నగరంలో పలుచోట్ల అర్ధరాత్రి నుండి భారీ వర్షాలు కురిశాయి.

బలపడిన అల్పపీడనం

బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం కారణంగా ఏడు జిల్లాల్లో వరద పరిస్థితులు నెలకొంటాయని భారత వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఆ మేరకు చెన్నై, కాంచీపురం, తిరువల్లూరు, విల్లుపురం, వేలూరు, కళ్ళకురిచ్చి, నాగపట్టినం జిల్లాల్లో కుండపోతగా కురిసిన వర్షాలకు ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకోనుండటంతో వరదలు సంభవించనున్నాయన్నారు. అంతే కాకుండా పల్లపు ప్రాంతాలన్నీ నీట మునిగి దీవులను తలపిస్తాయన్నారు. 20 జిల్లాల్లో శుక్రవారం భారీగా, ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఆ మేరకు చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, తేని, మదురై, శివగంగ విరుదునగర్, రామనాథపురం, కన్నియాకుమారి, తిరువారూరు, నాగపట్టినం, తంజావూరు, పుదుకోట సహా మొత్తం 20 జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించారు.


రామనాథపురంలో ఎగసిపడుతున్న అలలు

తీవ్రరూపం దాల్చిన రుతుపవనాలు..

బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం గురువారం మధ్యాహ్నం మన్నార్ జలసంధికి చేరువగా కదులుతుండటంతో రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు కురిశాయని భారత వాతావరణ పరిశోధన సంస్థ దక్షిణ మండల అధికారి బాలచంద్రన్ తెలిపారు. అల్పపీడనం కారణంగా ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఈ రుతువపనాల ప్రభావంతో సాధారణ స్థాయి కంటే 16 శాతం అధికంగా వర్షాలు కురిశాయని చెప్పారు. చెన్నై నుంగంబాక్కంలోని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం ఉదయం కడలూరు జిల్లాల్లో 72 చోట్ల భారీ వర్షాలు కురిశాయని తిరునల్వేలి, తూత్తుకుడి తెన్‌కాశి, రాణిపేట, తిరువణ్ణామలై, కోయంబత్తూరు జిల్లాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు కురిశాయని తెలిపారు. రాజధాని నగరం చెన్నైకి సంబంధించినంతవరకు నెర్‌కుంద్రం వద్ద 10 సెం.మీ.లు, మీనంబాక్కంలో 8 సెం.మీలు, తరమణిలో 7 సెం.మీలు, పూందమల్లి 6 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. శుక్రవారం దక్షిణాది జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయన్నారు. బలపడిన అల్పపీడనం మన్నార్‌జలసంధి వద్ద తీరం వైపు కదులుతుండంతో సముద్రతీరం వైపు గంటకు 35 నుండి 45 కి.మీ.వేగంతో పెనుగాలులు వీచే అవకాశం ఉండటంతో జాలర్ల మరో రెండు రోజులపాటు చేపలవేటకు వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేసినట్లు బాలచంద్రన్ తెలిపారు.

15 విమాన సర్వీసులకు అంతరాయం..

భారీ వర్షాల కారణంగా చెన్నై విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన మూడు విమానాలు, వివిధ నగరాల నుండి రావాల్సిన మరో మూడు విమానాలు మొత్తం ఆరు విమాన సర్వీసులు రద్దయ్యాయి. చెన్నై నుంచి తిరువనంతపురం, కొల్‌కతా, సిలిగురికి వెళ్లాల్సిన విమానాలు వర్షాల కారణంగా రద్దు చేశారు. అదే విధంగా చెన్నై రావాల్సిన మూడు విమానాలు కూడా రద్దయ్యాయి. షార్జా, దుబాయ్, శ్రీలంక, సింగపూరు తదితర దేశాలకు వెళ్ళాల్సిన అంతర్జాతీయ విమానాలు, అండమాన్, ఢిల్లీ ముంబయి, తిరుచ్చి, కోయంబత్తూరు, కొచ్చిన్ వెళ్ళాల్సిన విమానాలు సహా మొత్తం 15 విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. ఇదిలా ఉండగా చెన్నై విమానాశ్రయం నుంచి ముంబయి వెళ్లే విమానంలో, కొచ్చిన్‌కు వెళ్లే విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. వేకువజాము 4.44 గంటలకు 160 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బందితో ముంబయికి బయలుదేరిన విమానం టేకాఫ్ చేస్తుండగా ఇంజన్‌లో సాంకేతిక లోపాన్ని గమనించిన పైలెట్ విమానాన్ని ఆపేశారు. మరమ్మతులు చేసిన తర్వాత ఆ విమానం ముంబయికి బయలుదేరింది. ఇదే విధంగా ఉదయం 6.30 గంటలకు కొచ్చిన్ బయల్దేరిన విమానం ఆకాశంలో ఉండగా యాంత్రిక లోపం ఏర్పడింది. పైలెట్ గమనించి కంట్రోలు రూమ్‌కు సమాచారం అందించి ఉదయం 7.15 గంటలకు అత్యవసరంగా ల్యాండింగ్ చేసి ప్రయాణికులను కాపాడారు. ఆ తర్వాత మరో విమానంలో ప్రయాణికులందరూ కొచ్చిన్ బయలుదేరారు.

డెల్టా జిల్లాల్లో కుంభవృష్టి...

కావేరి డెల్టా జిల్లాల్లోనూ గురువారం ఉదయం కుండ పోతగా వర్షాలు కురిశాయి. దీంతో ఆ జిల్లాల్లోని పంటలు నీటమునిగాయి. గురువారం వేకువజాము ఒంటి గంట నుంచి ఉదయం ఏడు గంటల వరకు ఈ జిల్లాల్లో భారీగా వర్షాలు కురిశాయి. తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై తదితర జిల్లాల్లో కురిసిన వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. తంజావూరు, తిరువారూరు జిల్లాలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీట మునిగింది. చెరువులు, వాగులు నీటితో నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి.


కోడంబాక్కంలో ఓ ఇంట్లో చేరిన నీరు

సామాజికన్యాయ శ్రీకార స్థలం 'వైక్కమ్'

● అందరికీ ఆలయ ప్రవేశానికి పెరియారే కారణం ● వివక్షతకు వ్యతిరేకంగా ఇంకా పోరాడాలి ● స్మారక మండపం ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశమంతటా కులమత విభేదాలు లేకుండా అన్ని వర్గాలవారు ఆలయాల్లో ప్రవేశించడానికి ద్రవిడ ఉద్యమనేత పెరియార్, ఆత్మగౌరవాన్ని ప్రతిపాదిస్తూ, ఆయన చేసిన సిద్ధాంతాలే ప్రధాన కారణమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. గురువారం కేరళలోని వైక్కమ్‌లో పునర్నిర్మించిన పెరియార్ స్మారక మండపాన్ని, గ్రంథాలయాన్ని సీఎం ప్రారంభించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ద్రావిడ కళగం నేత కె.వీరమణి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. రెండు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల సమక్షంలో స్టాలిన్, పినరయి విజయన్ కలిసి పెరియార్ స్మారక మండపాన్ని, తర్వాత గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ... డీఎంకే ప్రధాన సిద్ధంతామైన సామాజిక న్యాయానికి ముందుగా శ్రీకారం చుట్టింది కేరళలోని వైక్కమ్ ప్రాంతంలోనేనని తెలిపారు. 1893లో తిరువాంకూర్ సంస్థానం పరిధిలో ఉన్న మహాదేవర్ ఆలయంలో బలహీనవర్గాలవారిని అనుమతించకుండా అంటరానితనాన్ని పాటించేవారని, ఆలయం నాలుగు వీధుల్లోనూ బలహీనవర్గాల ప్రజలను నడిచేందుకు కూడా అనుమతించేవారు కారన్నారు. ఆ పరిస్థితుల్లో వైక్కమ్ వద్ద బలహీన వర్గాలవారిని ఆలయ ప్రవేశం కోసం ఉద్యమాలు జరిగినప్పుడు పెరియార్ పాల్గొని ఉద్యమాన్ని తీవ్రతరం చేశారని స్టాలిన్ గుర్తు చేశారు. కేరళ న్యాయవాది మాదవన్, కేశమేనన్, బారిస్టర్ జార్జ్ జోసెఫ్ తదితర నాయకులు ఉద్యమం నిర్వహిస్తుండగా మద్రాసు ప్రెసిడెన్సీలో కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉన్న పెరియార్ ఆ ఉద్యమాన్ని తీవ్రస్థాయిలో కొనసాగించేందుకు వైక్కమ్ ప్రాంతానికి వెళ్ళారన్నారు. జైలు జీవితం అనుభవించినా చివరకు లక్ష్యాన్ని సాధించారన్నారు. అన్ని వర్గాలతో కలసి ఆలయ ప్రవేశం కూడా చేశారన్నారు. ఈ ఉద్యమం గురించి భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ తన రచనల్లో ప్రస్తావించి పెరియార్ చేసిన ఉద్యమం చిరస్మరణీయమని పేర్కొన్నారని స్టాలిన్ గుర్తు చేశారు. వైక్కమ్ ఉద్యమం శతవార్షికోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా రూ.8.14 కోట్లతో కొత్త మెరుగులు దిద్దుకున్న పెరియార్ స్మారక మండపాన్ని కేరళ సీఎం పినరాయ్ విజయన్‌తో కలిసి ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సామాజిక న్యాయం కోసం తాము నిరంతర పోరాటం చేస్తూనే ఉంటామని, సమాజంలో తారతమ్యాలు ఇంకా కొనసాగుతున్నాయని, పెరియార్, అంబేడ్కర్, శ్రీనారాయణగురు, మహాత్మ జ్యోతిపూలే, సావిత్రీబాయ్ పూలే, అయ్యన్‌కాళి, కారల్‌మార్క్స్ వంటి మేధావుల సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని అన్ని చోట్లా శాంతి సమభావన స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం తరపున మంత్రులు దురైమురుగన్, ఈవీ వేలు, సామినాధన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానంద,ం కేరళ రాష్ట్ర మంత్రులు వీఎన్ వాసవన్, సజీ చెరియన్, కొట్టాయం ఎంపీ కె.ఫ్రాన్సిస్ జార్జ్, ఎమ్మెల్యే సీకే ఆషా, వైక్కమ్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రీతా రాజేష్, కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు. కాగా కార్యక్రమంలో భాగంగా పలువురు ద్రావిడ సిద్ధాంత ఉద్యమకారులను, సాహితీవేత్తలను సత్కరించారు.


పెరియార్ స్మారక మండపాన్ని ప్రారంభిస్తున్న స్టాలిన్, పినరయి విజయన్


సాహితీవేత్తలను సత్కరిస్తున్న దృశ్యం

భారీ వర్షాలకు నలుగురి బలి

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా వేర్వేరు ఘటనల్లో పాఠశాల విద్యార్థి, అయ్యప్ప భక్తుడి సహా నలుగురు మృతిచెందారు. వారిలో ముగ్గురు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డారు. రాష్ట్రంలో పది రోజుల క్రితం 'ఫెంగల్' తుఫాన్ కారణంగా పలు ప్రాంతాల్లో పదిమంది మృతిచెందారు. ఈ క్రమంలో, ప్రస్తుతం అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా మృతిచెందిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

నాగపట్టణం జిల్లాలో ఇంటి గోడ కూడి 13 ఏళ్ల బాలుడు మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. జిల్లాలో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. సెంబియన్ మహాదేవి గ్రామానికి చెందిన మురుగదాస్ ఇంటి పైకప్పుపై పక్క ఇంటి గోడ కూలి పడింది. ఈ ఘటనలో ఇంట్లో నిద్రిస్తున్న మురుగదాస్, ఆయన భార్య, కుమార్తె, కుమారుడు కవియళగన్ (13) గోడ శిధిలాల కింద చిక్కుకున్నారు. చుట్టుపక్కల వారు శిధిలా నుంచి వారిని రక్షించి నాగపట్టణం ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో కవియళగన్ మృతిచెందాడు. మురుగదాస్ సహా ముగ్గురిని వైద్యులు చికిత్సలందిస్తున్నారు.


మృతుడు కవియళగన్
(ఫైల్‌ఫొటో)

రాణిపేట జిల్లా మోచూర్ ప్రాంతానికి చెందిన సురేష్ (23) ప్రస్తుతం అయ్యప్ప మాల ధరించాడు. బుధవారం రాత్రి ఓ ఆలయంలో పూజల్లో పాల్గొన్న సురేష్, రాత్రి అక్కడే ఉన్నాడు. గురువారం ఉదయం స్నానం చేసి, ఉతికిన బట్టలను ఆరబెడుతున్న సమయంలో కిందపడిన విద్యుత్ తీగపై కాలు వేయడంతో విద్యుదాఘాతానికి గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు.

తిరుపోరూర్ సమీపంలో...

చెంగల్పట్టు జిల్లా తిరుపోరూర్ సమీపంలోని పొలాల్లో ఇద్దరు యువకులు మృతిచెంది ఉండడాన్ని గురువారం ఉదయం గ్రామస్తులు గుర్తించారు. సమాచారం అందుకున్న కాయారు పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా తరచూ విద్యుత్ పరికరాలు చోరీకి గురవుతున్నాయి. మృతుల పక్కన విద్యుత్ పరికరాలను కట్ చేసే పరికరాలు ఉండడంతో, వారు చోరీకి వచ్చి విద్యుదాఘాతానికి గురై మృతిచెంది ఉంటారని భావించిన పోలీసులు మృతుల వివరాలకు కోసం విచారిస్తున్నారు.

తిరువణ్ణామలైలో నేడు 'మహా దీపోత్సవం'

● కొండ శిఖరంపైకి చేరిన కొప్పెర ● 4,029 ప్రత్యేక బస్సులు, 22 ప్రత్యేక రైళ్లు

ప్యారీస్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన తిరువణ్ణామలై మహా దీపోత్సవానికి ప్రత్యేకంగా ముస్తాబైంది. అరుణాచలేశ్వరాలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో, మామిడి, అరటి తోరణాలు, పూలతో అలంకరించారు. ఈ దివ్యక్షేత్రంలో కోలాహలంగా నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహాదీపాన్ని శుక్రవారం సాయంత్రం 6. గంటలకు 2,668 అడుగుల ఎత్తు కొండ శిఖరంపై వెలిగించనున్నారు. తెల్లవారు జామున 4 గంటలకు ఉన్నామలై అమ్మవారి సమేత అరుణాచలేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి 'భరణి దీపం' వెలిగిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు అదనంగా 4,029 ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే 22 ప్రత్యేక రైళ్లను గురువారం నుంచి తిరువణ్ణామలైకు నడుపుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్తీక దీపోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం తిరువణ్ణామలై జిల్లాలో కలెక్టర్ భాస్కర్ పాండ్యన్ ఒకరోజు ప్రకటించారు.

11 రోజుల పాటు నిర్విరామంగా మహాదీపం

2,668 అడుగుల అరుణాచలేశ్వర కొండ శిఖరంపై మహాదీపం వెలిగించేందుకు ఆవిన్ నుంచి కొనుగోలు చేసిన 4,500 కిలోల నెయ్యి, 5,500 మీటర్ల నూలు దారంతో చేసిన ఒత్తిని ఉభయకర్తలు ఆలయ నిర్వాహకులకు కానుకగా సమర్పించారు. 11 రోజుల పాటు నిర్విరామంగా వెలగనున్న మహాదీపం కోసం ప్రత్యేకంగా తయారు చేసిన 5 అడుగుల ఎత్తు 200 కిలోల బరువైన పాత్రకు గురువారం ఉదయం 5 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పర్వత రాజ వంశానికి చెందిన సుమారు 20 మంది ఆ పాత్రను భుజంపై మోస్తూ కిండ శిఖరంపైకి తరలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అరుణాచలేశ్వర కొండపై నుంచి బండరాళ్లు, మట్టిపెల్లలు దొర్లిన ఘటనను దృష్టిలో ఉంచుకుని కొండ దిగువ నుంచి శిఖరం వరకు ముందస్తు చర్యలు చేపట్టారు.

4 రోజుల వరకూ ప్రత్యేక బస్సులు...

భక్తుల సౌకర్యార్థం తిరువణ్ణామలైకు 4 రోజుల పాటు 4,029 ప్రత్యేక బస్సులను రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్నాయి. వేలూరు డివిజన్ నుంచి 80 బస్సులు, తిరుపత్తూర్ నుంచి 40 బస్సులు, ఆర్కాడు నుంచి 30 బస్సులు, అలాగే చెన్నై తదితర ప్రాంతాల నుంచి బస్సుల సేవలు అందుబాటులో ఉన్నాయి. తిరువణ్ణామలై నగరాన్ని కలిపే మార్గంలో ఒకే సమయంలో 3 వేల బస్సులు పార్కింగ్ చేసేలా మొత్తం 25 ప్రాంతాల్లో తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశారు. 21 వేల వాహనాల కోసం 120 ప్రాంతాల్లో పార్కింగ్ కల్పించారు.

14 వేల మంది పోలీసులతో బందోబస్తు..

కార్తీక మహా దీపం వెలిగించే కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రలకు చెందిన సుమారు 40 వేలకు పైగా భక్తులు తిరువణ్ణామలెకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్న పోలీసు శాఖ భద్రతా ఏర్పట్లును కట్టుదిట్టం చేసింది. ఏడీజీపీ డేవిడ్‌సన్ ఆశీర్వాదం, ఐజీ అస్రా కార్గ్ నేతృత్వంలో ఏడుగురు డీఐజీలు 32 మంది ఎస్పీల సహా 14 వేల మంది పోలీసులతో బందోబస్తు కల్పించారు.. మరో 20 ప్రత్యేక కమాండో భద్రతా దళ సిబ్బంది, 24 ఫైరింజన్లతో 600 మంది అగ్నిమాపక సిబ్బంది, 2020 మంది అటవీ శాఖ సిబ్బంది కూడా విధుల్లో పాల్గొంటున్నారు. కాగా దేవాదాయ శాఖ చేసిన ఉత్తర్వుల మేరకు మహా దీపం వెలిగించే కొండపైకి భక్తులెవ్వరూ వెళ్లకుండా నిఘా పెంచారు.


కొండపైకి మహాదీప కొప్పెరను తరలిస్తున్న దృశ్యం

త్వరలో మరో 2 అల్పపీడనాలు

చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం మన్నార్ జలసంధి తీరం వైపు కదులుతుండటంతో రాష్ట్రంలో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ తీవ్ర అల్పపీడనం వల్ల ఈశాన్య రుతుపవనాలు సైతం బలాన్ని పుంజుకున్నాయి. ఈ పరిస్థితులలో ఈ నెల 14, 20 తేదీల్లో బంగాళాఖాతంలో మరో రెండు అల్పపీడనాలు ఏర్పడనున్నాయని వాతావరణశాఖ వర్గాలు తెలిపాయి. ఈ నెల 14న ఏర్పడబోయే అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని, అదే జరిగితే భారీగా వర్షాలు కురుస్తాయన్నారు. ఆ అల్పపీడనం వల్ల 14, 15 తేదీల్లో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయన్నారు. ఇదే విధంగా ఈ నెల 20న కూడా మరో అల్పపీడనం ఏర్పడుతుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

3 జిల్లాల్లో కుండపోత...

బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం కారణంగా తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాలకు గురువారం రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఆ మేరకు స్థానిక వాతావరణ కేంద్రం ఓ ప్రకటన జారీ చేసింది. అల్పపీడనం మన్నార్ జలసంధి వైపు కదులుతుండటంతో సముద్రతీర జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని, ప్రత్యేకించి తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయని తెలిపారు. భారీ వర్షసూచన కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, తిరువారూరు, రామనాథపురం, దిండుగల్, విల్లుపురం, పుదుకోట, మైలాడుదురై, తంజావూరు, కడలూరు, అరియలూరు, రాణిపేట, కరూరు, వేలూరు, తూత్తుకుడి, తిరుపత్తూరు, సేలం జిల్లాల్లో శుక్రవారం సెలవు ప్రకటించారు. తిరునల్వేలి జిల్లాలో 1 నుండి 5 తరగతులకు (ప్రాథమిక పాఠశాలలకు) సెలవు ప్రకటించారు. తిరువణ్ణామలై జిల్లాలో స్కూళ్లు, కళాశాలలకు శుక్రవారం సెలవు ప్రకటించారు.

సమాచార దర్శిని

మెట్రోలో రూ.33 కోట్లతో షాపింగ్ మాల్

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేట మెట్రో రైల్వేస్టేషన్‌లో రూ.33 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకానుంది. కాంప్లెక్స్ నిర్మాణాన్ని బి అండ్ బి డెవలపర్స్ బిల్డర్స్ సంస్థలకు అప్పగించారు. ఈ మేరకు బుధవారం జరిగిన కార్యక్రమంలో చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధిక్ నేతృత్వంలో ఇరు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బాబీ బెనెడిక్ట్ ఒప్పందాలపై సంతకాలు చేశారు.

నేడు మాజీ సైనికుల గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్‌లో మాజీ సైనికుల గ్రీవెన్స్ శుక్రవారం జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రభు శంకర్ విడుదల చేసిన ప్రకటనలో... తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జరుగనున్న ఈ శిబిరంలో కుటుంబ పించన్ల సమస్యలు, పించన్ మంజూరు తదితర సమస్యలతో పాటు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చు. మాజీ సైనికులు, పించన్ పొందుతున్న కుటుంబ సభ్యులు పించన్ మంజూరు సర్టిఫికెట్, బ్యాంక్ ఖాతా తదితరాలతో సమావేశంలో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో వసతులకు రూ.12.38 కోట్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆధునిక ల్యాబ్, పరిశోధన కేంద్రాలు సహా పలు వసతుల ఏర్పాటుకు రూ.12.38 కోట్లు కేటాయించినట్లు ఉన్నత విద్యా శాఖ మంత్రి కోవీ చెళియన్ తెలిపారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... గత అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నత విద్యా పద్దుపై ప్రసంగించిన ముఖ్యమంత్రి, 11 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలను మెరుగుపరచనున్నట్లు ప్రకటించారని తెలిపారు. ఈ మేరకు రూ.12.38 కోట్లు నిధులను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.

చదురగిరి వెళ్లేందుకు భక్తులకు నిషేధం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లాలోని చదురగిరి కొండ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు అటవీ శాఖ అధికారులు నిషేధం విధించారు. కార్తీక పౌర్ణమి, ప్రదోషం సందర్భంగా శుక్రవారం నుంచి ఈ నెల 16వ తేది వరకు భక్తులను అనుమతిస్తున్నట్లు ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో, పశ్చిమ కనుమల కొండల్లో భారీవర్షాలు కురుస్తుండడంతో, భక్తుల భద్రత దృష్ట్యా చదురగిరి ఆలయానికి వెళ్లేందుకు నిషేధం విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వైద్య విద్య సంస్థకు నిధుల కేటాయింపు

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య విద్య నిర్వహణ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రూ.87.08 కోట్లను కేటాయించింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రతి ఏడాది 5,050 ఎంబీబీఎస్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. పెరుగుతున్న అవసరాలు పరిగణలోకి తీసుకొని, పాఠ్యాంశాల్లో మార్పులు, మెరుగైన బోధన, అత్యాధునిక పరిశోధన తదితరాలు అభివృద్ధి చేసేలా రాష్ట్ర వైద్య విద్య నిర్వహణ సంస్థ ఏర్పాటు కానుంది. మెడికల్ ఎడ్యుకేషన్ రీసెర్చి, డేటా మేనేజ్‌మెంట్, లెర్నింగ్ ప్రాసెస్ తదితరాలకు రూ.87.08 కోట్లు కేటాయించారు.ఈ సంస్థకు వైద్య విద్య, పరిశోధన డైరెక్టరేట్ ద్వారా పని చేయనుందని సచివాలయం తెలిపింది.

ప్రజా సంబంధాల శిబిరాలు నిర్వహించాలి

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంబంధాల శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. 2026 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు ప్రజలకు తెలియజేసేలా ప్రజా సంబంధాల శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ప్రజల సమస్యలను నెల రోజుల్లో పరిష్కారించేలా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ శిబిరాలు ఈ నెలాఖరులోగా ముగించేలా జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలని ప్రభుత్వం పేర్కొంది.

చెంగల్పట్టు జిల్లాలో నిండిన చెరువులు

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా చెంగల్పట్టు జిల్లాలో కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 528 చెరువులుండగా, వాటిలో 345 చెరువులు పూర్తిస్థాయికి చేరుకున్నాయి. మిగిలిన చెరువుల్లో 80 నుంచి 90 శాతం నీటినిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

కొండ రైలుమార్గంపై పడిన చెట్టు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో నీలగిరి జిల్లాలో బుధవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. గురువారం ఉదయం గాలులకు కున్నూర్-ఊటీ కొండ రైలు పట్టాలపై భారీ చెట్టు విరిగిపడింది. దీంతో, ఈ మార్గంలో కొండ రైలు సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని రైలు పట్టాలపై పడిన చెట్టు శిథిలాలు తొలగించారు.

కల్యాణ మండపానికి మోక్షమెప్పుడో ?

● మూడేళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోని వైనం

టి.నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆవడిలో నిర్మించిన అమ్మా కల్యాణ మండపం మూడేళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆ మండపం చుట్టూ యేళ్ల తరబడి చెత్తాచెదారం పడి ఉండటంతో దుర్వాసన వస్తోంది. ఆవడి కార్పొరేషన్ గృహనిర్మాణ సంస్థ క్వార్టర్స్ వద్ద గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమ్మా కల్యాణ మండపాన్ని రూ.11 కోట్లతో నిర్మించాలని తీర్మానించారు. 2018లో కల్యాణమండపానికి శంకుస్థాపన జరిగింది. మూడంతస్థుల్లో నిర్మించే ఈ కల్యాణ మండపంలో అత్యంత ఆధునిక సదుపాయాలతో కిచెన్, డైనింగ్ హాలు, వెడ్డింగ్ హాలు, వధూవరుల విశ్రాంతి గదులు నిర్మించారు. అంతే కాకుండా ఈ మండపం వద్ద పార్కింగ్ ప్లేస్ కూడా ఉంది. ఈ మండపంలో సామాన్యులు కూడా తమ పిల్లలకు వివాహ వేడుకలు, శుభకార్యాలను జరుపుకునేలా రోజుకు రూ.50వేలు అద్దెగా నిర్ణయించారు. ఈ వెడ్డింగ్ హాలు ఆవడి రైల్వేస్టేషన్‌కు, బస్టాండుకు చేరువగా ఉంది. అన్ని హంగులతో ఈ వెడ్డింగ్ హాలు నిర్మాణం పూర్తయింది. అయితే నిర్మించి మూడేళ్లవుతున్నా ఇంకా ప్రారంభం కాలేదు. ఈ మండపం చుట్టూ పలు ప్రైవేటు కల్యాణ మండపాలున్నాయి. అమ్మా కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తే ప్రైవేటు కల్యాణ మండపాలకు నష్టం వాటిల్లుతుందన్న కారణంగానే ఈ మండపాన్ని ప్రారంభించలేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి నిర్మించిన ఈ కళ్యాణమండపాన్ని మూడేళ్లుగా ఇలా నిరుపయోగంగా ఉంచటం భావ్యమేనా? అని పాలకులను స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



ఆవడిలోని అమ్మా కల్యాణమండపం

టంగ్‌స్టన్ సొరంగం ఏర్పాటును విరమించుకోండి

● కేంద్రమంత్రికి అన్నామలై వినతి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న అన్నామలై

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): టంగ్‌స్టన్ సొరంగం ఏర్పాటును విరమించుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై త్వరలో ఆశించిన ప్రకటన వెలువడుతుందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని అన్నామలై తెలిపారు. ఈ విషయమై అన్నామలై మాట్లాడుతూ.. మదురై జిల్లా అరిట్టాపట్టి, నాయకన్‌పట్టి ప్రాంతాల్లో టంగ్‌స్టన్ సొరంగం ఏర్పాటును విరమించుకోవాలని తాము ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. మదురై జిల్లా ప్రజల తరఫున కేంద్ర మంత్రి మురుగన్, తాను కలసి గురువారం ఢిల్లీ వెళ్లి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించామని తెలిపారు.

ఆరు గ్రాముల హెరాయిన్ స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ ప్రాంతంలో ఆరు గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. అడయార్ పోలీసులకు అందిన సమాచారంతో బుధవారం రాత్రి అడయార్ గాంధీ నగర్ బస్టాండ్ వెనుక వైపు మెయిన్ రోడ్డులో తనిఖీలు చేపడుతున్న సమయంలో, అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న అస్సాం రాష్ట్రం నాకోన్ ప్రాంతానికి చెందిన అనరుల్ ఇస్లామ్ ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేపట్టగా, అతని వద్ద 65 ప్లాస్టిక్ కవర్లలో ఉంచిన 6 గ్రాముల హెరాయిన్ గుర్తించి స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

రోగులు చెల్లించిన నగదు స్వాహా..

ఇద్దరు ఉద్యోగుల అరెస్ట్

ఐసిఎఫ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో రోగులు చెల్లిస్తున్న నగదులో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక విభాగం రోగులు చెల్లించే నగదును ఆస్పత్రికి ఖాతాలో జమచేయకుండా అవినీతికి పాల్పడుతున్నారని, వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఆస్పత్రి డీన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, రోగులు చెల్లించిన నగదును ఆస్పత్రి ఖాతాలో జమచేయకుండా అవినీతికి పాల్పడిన న్యూ వాషర్‌మెన్‌పేట ముత్తయ్య వీధికి చెందిన కుబేరన్, తిరువళ్లూర్ జిల్లా ఆవడి కామరాజర్ నగర్‌కు చెందిన కలైమగళ్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి న్యాయమూర్తి ఉత్తర్వులతో జైలుకు తరలించారు.

లింక్ క్లిక్ చేస్తే రూ.2.46 లక్షలు మాయం !

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌కు వచ్చిన లింక్ క్లిక్ చేసిన యువకుడు రూ.2.46 లక్షలు కోల్పోయాడు. మడిపాక్కంకు చెందిన దేశికన్ సెల్‌ఫోన్‌కు బుధవారం సాయంత్రం ఓ మెసేజ్ వచ్చింది. అందులోని లింక్‌ను దేశికన్ క్లిక్ చేశాడు. కొద్దిసేపట్లో అతడిబ్యాంక్ ఖాతా నుంచి రూ.2.46 లక్షలు బదిలీ అయినట్లు మెసేజ్ రావడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. ఈ వ్యవహారంపై బాధితుడు ఫిర్యాదుతో సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు. తమ సెల్‌ఫోన్ల వచ్చే మెసేజ్‌లోని లింక్‌లను ఎవరూ క్లిక్ చేయరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కేంద్ర కారాగారాల్లో రూ.5.91 కోట్ల ఉత్పత్తులు అదృశ్యం!

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు కేంద్ర కారాగారాల్లో తయారుచేసిన రూ.5.91 కోట్ల విలువైన ఉత్పత్తులు అదృశ్యమయ్యాయని ఆడిట్ నివేదికలో తెలిసింది. నివేదిక ప్రకారం... మదురై, కడలూరు, పాళయం కోట కేంద్ర కారాగారాల్లో తయారుచేసిన ఉత్పత్తులు వాటిని వినియోగించే శాఖలకు అందలేదు. అందువల్ల ప్రభుత్వానికి రూ.5.91 కోట్ల నష్టం వాటిల్లింది. మదురై కారాగారం నుంచి రూ.1.15 కోట్ల సరుకులు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నా, వాటిని సరఫరా చేయలేదు. ఈ విషయం నెలవారీ వస్తువులు, సేవల నివేదిక ద్వారా వెల్లడైంది.

నీరు విడుదలపై ముందస్తు ప్రకటన

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నదులు, చెరువుల నుంచి నీటిని విడుదల చేసే సమయంలో ముందుగా ప్రజలను అప్రమత్తం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా కొన్ని జిల్లాల్లో జలశయాలు పూర్తిస్థాయికి చేరుకున్నాయన్నారు. ఎలాంటి ప్రకటన లేకుండా హఠాత్తుగా నీరు విడుదల చేస్తే తీరప్రాంతాలు జలమయం అవుతాయన్నారు. ముందుగానే ప్రజలను హెచ్చరించాలని, ముంపు ప్రాంతాల నుంచి ముందుగానే పునరావాస శిబిరాలకు తరలించాలని బాలకృష్ణన్ విజ్ఞప్తి చేశారు.

రిజిస్ట్రేషన్ శాఖకు రూ.14,525 కోట్ల ఆదాయం

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రిజిస్ట్రేషన్ శాఖ ఈ నెల 11వ తేది వరకు రూ.14,525 కోట్లు ఆదాయం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలం (డిసెంబరు 11వ తేది) వరకు రూ.12,634 కోట్లు ఆదాయం సమకూరింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.1,891 కోట్లు అదనపు ఆదాయం చేకూరిందని అధికారులు తెలిపారు.

కుల వివాదం సృష్టించేలా మాట్లాడిన టీచర్ సస్పెన్షన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):కుల వివాదం సృష్టించేలా మాట్లాడిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటుపడింది. తంజావూరు జిల్లా ఆరలూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో అలెగ్జాండర్ ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేది అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఓ సంస్థ ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓ వర్గాన్ని కించపరిచేలా అలెగ్జాండర్ చేసిన ప్రసంగం సోషల్ మీడియాలో వెలువడింది. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తిరుపానంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన తంజావూరు జిల్లా ప్రధాన విద్యాధికారి అన్నాదురై, ఇరువర్గాలను రెచ్చగొట్టేలా, సామాజిక న్యాయానికి విఘాతం కలిగించేలా ప్రసంగించిన ఉపాధ్యాయుడు అలెగ్జాండర్‌ను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రైలుమార్గం భూసేకరణలో బాధితులకు అందని పరిహారం

● సేలం కలెక్టర్ కార్యాలయం జప్తు



కలెక్టర్ కార్యాలయాన్ని జప్తు చేస్తున్న సిబ్బంది

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సేలం-కరూర్ బ్రాడ్ గేడ్ రైలు మార్గం కోసం భూములు ఇచ్చిన వారికి నష్ట పరిహారం చెల్లించకపోవడంతో, కోర్టు ఉత్తర్వులతో సేలం కలెక్టర్ కార్యాలయాన్ని జప్తు చేశారు. సేలం-కరూర్ బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని 20 ఏళ్ల క్రితం ప్రారంభించగా, రైలు మార్గం కోసం సేలం, నామక్కల్, కరూర్ జిల్లాల్లోని భూములు సేకరించారు. ఈ పథకం ప్రారంభమై 22 ఏళ్ల గడిచినా ఇప్పటివరకు భూములు అందజేసిన వారికి పరిహారం చెల్లించలేదు. దీంతో, బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారించిన కోర్టు, పరిహారం అందించాలని సేలం జిల్లా రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. కోర్టు ఆదేశించినా అధికారులు స్పందిచకపోవడంతో, సేలం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని జప్తు చేయాలని కోర్టు మరు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో, గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న సిబ్బంది జప్తు చర్యలు చేపట్టారు. కార్యాలయంలోని వస్తువులకు సీలు వేశారు. కలెక్టర్ కార్యాలయాన్ని జప్తు చేయడం అటు ఉద్యోగులు, ఇటు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది.

పెరిగిన టెంకాయ ధరలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శబరిమల సీజన్, కార్తీక దీపోత్సవాల సందర్భంగా టెంకాయల ధరలు రెండింతలు పెరిగాయి. రామనాథపురం జిల్లాలో 8,420 హెక్టార్లలో కొబ్బరి సాగు చేస్తుంటారు. అలాగే, రామేశ్వరం సహా తీర ప్రాంతాల్లోనూ టెంకాయల సాగు అధికంగా ఉంది. ప్రస్తుతం శబరిమల సీజన్, కార్తీక దీపోత్సవాల సందర్భంగా టెంకాయల ధరలు పెరిగాయి. సాధారణంగా రూ.15కు విక్రయిస్తున్న టెంకాయ, ప్రస్తుతం రూ.40 నుంచి రూ.50 వరకు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలను రక్షించాలంటూ సామూహిక ప్రార్థనలు



దివ్య ప్రబంధన పారాయణం చేస్తున్న భక్తులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తుపాను, భారీవర్షాలు, విపత్తుల నుంచి ప్రజలను కాపాడాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని కోరుతూ భక్తులు సామూహిక ప్రార్థనలు చేశారు. మహాబలిపురంలోని తలశయన పెరుమాళ్ ఆలయంలో గురువారం ఉదయం భక్తులంతా కలిసి 4 వేల దివ్య ప్రబంధనాలు పారాయణం చేశారు. ఆలయ జాయింట్ డైరెక్టర్ సెల్వకుమార్, మేనేజర్ సంతానం తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

18 నుంచి ఆవిన్ 'గ్రీన్ మ్యాజిక్ ప్లస్'

● ఆవిన్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్

ప్యారీస్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రోటీన్లు అధికంగా ఉండే 'గ్రీన్ మ్యాజిక్ ప్లస్' అనే కొత్త రకం పాలను ఈ నెల 18వ తేదీ కాంచీపురం, తిరువళ్లూరు, కోయంబత్తూరు, సేలం జిల్లాల్లో పరిచయం చేయనున్నట్లు 'ఆవిన్ సంస్థ' మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వినీత్ పేర్కొన్నారు. ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆవిన్ సంస్థ తయారు చేస్తున్న పాలు, పాలతో తయారయ్యే ఉత్పత్తులకు రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ పెరిగిందన్నారు. రాష్ట్రంలో పదివేలకు పైగా ఉన్న ఆవిన్ పార్లర్లు డీలర్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, ఉత్సవాలు జరిగే ఆధ్యాత్మిక కేంద్రాలు, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కొత్తగా ఆవిన్ పార్లర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అలాగే ప్రోటీన్ల శాతం అధికంగా ఉన్న పెరుగు ప్యాకెట్లను రాజధాని నగరంలో ఇటీవల ప్రవేశపెట్టామని, దీనికి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందన్నారు.

నీలవేము కషాయం పంపిణీ

వేలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో కార్పొరేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో నీలవేము కషాయం అందజేశారు. వర్షాల సమయంలో వ్యాపించే అంటువ్యాధులను నియంత్రించేలా జిల్లా యంత్రాంగం పలు చర్యలు చేపట్టింది. అలాగే, ప్రజల్లో వ్యాధినిరోధక శక్తి పెంచేలా నీలవేము కషాయం అందజేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రజలు అధికంగా సంచరించే 18 ప్రాంతాల్లో నీలవేము కషాయం అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం

● యువకుడికి యావజ్జీవం

ఐసిఎఫ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన కేసులో యువకుడికి పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. కాంచీపురం జిల్లాకు చెందిన విజయ్‌కుమార్ 2018లో మూడేళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. అనంతరం బాలిక నడతలో మార్పులు గమనించిన తల్లిదండ్రులు ప్రశ్నించగా ఆమె చెప్పింది విని దిగ్భ్రాంతి చెందారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన కాంచీపురం మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు, విజయ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు చెంగల్పట్టు పోక్సో కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో నిందితుడు విజయ్‌కుమార్‌కు యావజ్జీవ జైలుశిక్ష, రూ.2,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నసీమా భాను తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత చిన్నారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షలు పరిహారంగా చెల్లించాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మత్తు ట్యాబ్లెట్లు విక్రయిస్తున్న ఏడుగురి అరెస్ట్

ప్యారీస్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదురవాయల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి 2100 మత్తు ట్యాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మదురవాయల్ ఫ్లైఓవర్ ప్రాంతంలో చట్ట విరుద్ధంగా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో బుధవారం ప్రత్యేక పోలీసు బృందం అక్కడ నిఘా వేసి అనుమానాస్పదంగా కనిపించిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని సుమారు రూ.1.50 లక్షల విలువైన 2100 మత్తు ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుపడిన ముఠాకు కాట్టుపాక్కంకు చెందిన సతీష్ (26), లోకేష్ (22), సారథ్యం వహించినట్లు తెలిసింది. వీరిని గురువారం ఉదయం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

ఓటేరిలో 1500 మత్తు మాత్రల స్వాధీనం..

పెరంబూరు నియోజకవర్గంలోని ఓటేరిలో మత్తు మాత్రలు విక్రయించిన శివ (29) అనే వ్యాన్ డ్రైవర్‌ని అరెస్టు చేసి అతడి నుండి 1500 మత్తు ట్యాబ్లెట్ల స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అయనవరం ప్రాంతానికి చెందిన అరవింద్ వద్ద మత్తు మాత్రలు కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తెలిసింది. శివను కోర్టులో హాజరుపరచి గురువారం జైలుకు తరలించిన పోలీసులు పరారీలో ఉన్న అరవింద్ కోసం గాలిస్తున్నారు.

పూందమల్లి జైలులో గంజాయి, సెల్ ఫోన్ల స్వాధీనం

● సబ్ జైలర్ సహా ఐదుగురు సస్పెన్షన్

ప్యారీస్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి జైలులో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో ఖైదీల నుంచి 5 సెల్ ఫోన్లు, గంజాయి, నగదు పట్టుపడ్డాయి.. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సబ్ జైలర్ సహా 5 గురు జైలర్లపై సస్పెన్షన్ వేటు పడింది. పూందమల్లి సబ్ జైలులో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యతో సంబంధం ఉన్న ముద్దయిలు, వివిధ నేరాలకు పాల్పడిన ఖైదీలున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఈ జైలులో ఖైదీల గదుల్లో రాష్ట్ర జైలు శాఖాధికారులు, పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఇందులో ఖైదీల నుంచి 5 సెల్ ఫోన్లు, గంజాయి పొట్లాలను, నోట్లను గుర్తించి స్వాధీనం చేశారు. జైలు అధికారుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సెల్వరాజ్, జైలర్లు జేమ్స్ ఉదయ్‌కుమార్, మారిసెల్వంతో సహా 5 గురిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అర్ధ సంవత్సరం పరీక్షలు వాయిదా

ప్యారీస్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారనుడడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం నుండే చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు మార్పు చెందడంతో బుధవారం రాత్రి నుంచి చెన్నై, విల్లుపురం సహా 20 జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అలాగే పాఠశాల ప్రాంగణాల్లో వరద నీరు భారీగా చేరింది. దీంతో గురువారం ప్రారంభించాల్సిన అర్ధ సంవత్సరం పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. అలాగే తిరువళ్లువర్ యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షలు కూడా వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

భారీవర్షాలకు నీటమునిగిన పంట



తడిచిన పంటతో రైతులు

ఐసిఎఫ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లాలో భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. కొడియనల్లూర్, వలివలం తదితర ప్రాంతాల్లో రైతులు సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతకు వచ్చే సమయంలో కురిసిన వర్షాలతో పంట నీటమునిగింది. పంట చేతికి అందే సమయంలో నీటిపాలు కావడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు తగిన పరిహారం అందజేసి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుశస్థలి తీరప్రాంతాల ప్రజలకు హెచ్చరిక



కుశస్థలి నేల వంతెనపై వరద ఉధృతి

తిరుత్తణి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం అమ్మంపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో కుశస్థలి నది తీర ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీచేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా కృష్ణాపురం రిజర్వాయర్ పూర్తి సామర్థ్యానికి చేరుకోవడంతో అదనపు జలాలను విడుదల చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని అమ్మంపల్లి, కత్తిరిపల్లి సహా ఏడు గ్రామాల మీదుగా రాష్ట్ర సరిహద్దులైన పళ్లిపట్టు కుశస్థలి నదికి నీరు చేరుతోంది. దీంతో నదిలో వరద ఉధృతి అధికంగా ఉందని, నది వంతెనపై వరద నీరు ప్రవహిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విజ్ఞప్తి చేశారు.

శశికళ కేసు త్వరగా ముగించండి

● మద్రాసు హైకోర్టు

ఐసిఎఫ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శశికళపై నమోదైన విదేశీ మారక ద్రవ్యం నియంత్రణ చట్టం (ఫెరా) కేసు విచారణ వేగవంతం చేయాలని ఎగ్మూర్‌లోని ఆర్థిక నేరాల న్యాయస్థానాన్ని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. జెజె టీవీకి విదేశాల నుంచి పరికరాల కొనుగోలులో అవినీతి జరిగిందని ఫెరా చట్టం కింద నమోదైన కేసు విచారణ ఎగ్మూర్‌లోని ఆర్థికనేరాల న్యాయస్థానంలో జరుగుతోంది. ఈ కేసులో నిందితులుగా జేజే టీవీ, టీవీ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరన్, టీవీ అధ్యక్షురాలు, డైరెక్టర్ శశికళను చేర్చారు. ఈ జాబితా నుంచి తన పేరు తొలగించాలంటూ శశికళ దాఖలుచేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, ఎం.జ్యోతిరామన్‌లతో కూడిన ధర్మాసనం... కేసులో ఏ1గా వున్నందున ఎలాంటి వెసులుబాటు ఇవ్వలేమంటూ శశికళ పిటిషన్‌ను తోసిపుచ్చారు. అలాగే, ఈ కేసు విచారణను త్వరగా ముగించాలని, విచారణకు శశికళ సహకరించాలని ఆదేశించారు.

అంబత్తూర్ పాలడిపోకు రూ.5.10 కోట్ల జరిమానా

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులకు మించి పాల ఉత్పత్తి, పనిచేయని మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం తదితరాలకు స్థానిక అంబత్తూర్ ఆవిన్ పాల డిపోకు రూ.5.10 కోట్ల జరిమానా విధించినట్లు దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్‌కు రాష్ట్ర పర్యావరణ నియంత్రణ బోర్డు తెలిపింది. అంబత్తూర్ పాల డిపో సహా కర్మాగారాల నుంచి వస్తున్న మురుగునీరు కొరట్టూరు చెరువులో కలువకుండా అడ్డుకోవాలంటూ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కొరట్టూరు చెరువు భద్రతా సంఘం పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారించిన ట్రిబ్యునల్, శుద్ధీకరించని మురుగునీరు కొరట్టూరు చెరువులో వదిలే చర్యలను రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు, నీటివనరుల శాఖలు అడ్డుకోవాలని, మురికి నీరు విడుదల చేసే కర్మాగారాలపై చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ పిటిషన్ మళ్లీ బుధవారం విచారణకు రాగా, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు తరఫున హాజరైన న్యాయవాది... అంబత్తూర్ ఆవిన్ పాల డిపో అనుమతులకు మించి అధికంగా 3.75 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి చేసిందని, ఇక్కడ మురికినీటి శుద్ధీకరణ కేంద్రం కూడా పనిచేయడం లేదని, అందువల్ల అంబత్తూర్ ఆవిన్ పాల డిపోకు రూ.5.10 కోట్ల జరిమానా విధించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది... జరిమానా అధికంగా ఉందని తెలిపారు. అనంతరం ట్రిబ్యునల్ న్యాయమూర్తి పుష్ప సత్యనారాయణ, నిపుణుల బృందం సభ్యులు సత్యగోపాల్, ఈ విషయమై ఆవిన్ సంస్థ, కాలుష్య నియంత్రణ బోర్డులు అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 16వ తేదీకి వాయిదావేశారు.

విద్యుత్ అంతరాయానికి పరిహారం

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయానికి పరిహారం అందించే నిబంధనలను విద్యుత్ నియంత్రణ కమిషన్ రూపొందించింది. నగరాల్లో అధిక ఓల్టేజీ విద్యుత్ మార్గాల్లో నెలకు 600 నిమిషాల కంటే ఎక్కువ విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రతి నిముషానికి 5పైసలు, గ్రామాల్లో 1200 నిమిషాలకు పైబడిన ప్రతి నిముషానికి 5పైసలు పరిహారం చెల్లించాలి. ఒక నెలలో 15కంటే ఎక్కువసార్లు విద్యుత్ అంతరాయం కలిగితే, నగరాల్లో 50పైసలు, గ్రామాల్లో 25కంటే ఎక్కువగా అంతరాయం ఏర్పడిన ప్రతిసారీ 50పైసలు పరిహారం చెల్లించాలి. ఈపరిహారం చెల్లింపుగడువు గత ఆగస్టుతో ముగిసిన నేపథ్యంలో, ప్రస్తుతం ఫిబ్రవరి వరకు పొడిగించారు.

జీఎస్టీ రద్దు కోరుతూ వ్యాపారుల ధర్నా



ఎగ్మోర్‌లో ధర్నా నిర్వహిస్తున్న వ్యాపారులు

ప్యారీస్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులు, కేంద్రప్రభుత్వ అద్దె దుకాణాలకు విధించిన 18 శాతం జీఎస్టీ రద్దు చేయాలని కోరుతూ గురువారం ఎగ్మోర్‌లోని రాజరత్నం స్టేడియం వద్ద తమిళనాడు వ్యాపారుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు టి.రవి నేతృత్వంలో వర్షానికి కూడా లెక్కచేయకుండా కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకించారు.

గిండి ప్రభుత్వాస్పత్రిలో 5,020 శస్త్రచికిత్సలు

● వైద్య సిబ్బందిని అభినందించిన మంత్రి సుబ్రమణ్యం

ఐసిఎఫ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని కలైంజర్ సెంటినరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 18 నెలల్లో 5,020 శస్త్రచికిత్సలు నిర్వహించారు. అందుకు కారణమైన వైద్యులు, నర్సులు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం అభినందించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... గత ఏడాది ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించిన ఈ ఆస్పత్రిలో అధునాతన శస్త్రచికిత్సా పరికరాలు, మెరుగైన వైద్యం అందిస్తుండడంతో, చికిత్సల కోసం ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరిగిందన్నారు. ఈ ఆస్పత్రి ప్రారంభించిన 18 నెలల్లో 538 న్యూరో, 1375 కిడ్నీ, 512 జనరల్, వెయ్యికి పైగా క్యాన్సర్ సర్జరీలు, 137 కార్డియాక్ బైపాస్, హార్ట్ వాల్వ్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించారు. అలాగే, కార్డియాలజీ విభాగంలో 10 నెలల్లో 1,683 యాంజియోగ్రామ్, స్టెంట్‌లు, పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ నిర్వహించి రికార్డు సృష్టించిందని ప్రభుత్వం తెలిపింది. ఈ క్రమంలో, గురువారం ఆస్పత్రికి వెళ్లి రోగులను పరామర్శించిన మంత్రి సుబ్రమణ్యం వైద్యులు, నర్సులు, సిబ్బందిని అభినందించినట్లు ప్రభుత్వం తెలియజేసింది.



రోగిని పరామర్శిస్తున్న మంత్రి సుబ్రమణ్యం



శత్రువులం కాదు... మంచి స్నేహితులం... కానీ

● నయనతార

హీరో ధనుష్, తాను శత్రువులం కాదని, మంచి మిత్రులమని, గత పదేళ్ళకాలంలో ఎక్కడ ఎలా మారిందో తనకు తెలియదని, ఇప్పుడు ఆ మూలాల్లోకి తాను వెళ్ళదలచుకోలేదని హీరోయిన్ నయనతార అన్నారు. ఆమె తాజాగా ఓ మీడియా చానెల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో ధనుష్, తనకు మధ్య ఉన్న స్నేహం, వైరాన్ని ఆమె వివరించారు. 'పబ్లిసిటీ కోసం ఒకరి ఇమేజ్ నాశనం చేసే వ్యక్తిని కాదు. డాక్యుమెంటరీ ప్రచారం కోసం అలా చేయలేదు. అసలు అది నా ఉద్దేశమే కాదు. ధనుష్ స్నేహితులు, మేనేజర్లకు అనేక సార్లు ఫోన్లు చేశాం. కానీ, అవేవీ ఫలించలేదు. 'నానుమ్ రౌడీ దాన్' సినిమా కోసం విఘ్నేష్ శివన్ రాసిన నాలుగు లైన్లను మాత్రమే మా డాక్యుమెంటరీలో ఉపయోగించాలని భావించాం. అవి మాకు వ్యక్తిగతంగా ఎంతో కనెక్ట్ అయ్యాయి. డాక్యుమెంటరీలో ఆ నాలుగు లైన్లు ఉండాలని బలంగా కోరుకున్నాం. ఇందుకోసం శక్తిమేరకు ప్రయత్నాలు చేశాం. ఆ నాలుగు లైన్లు మా జీవితంతో ముడిపడివున్నాయి. ఆ లైన్లకు నిర్మాతగా ధనుషే తొలుత ఓకే చెప్పారు. మేమిద్దరం మంచి స్నేహితులం. అతనికి కొన్ని కారణాలు ఉన్నట్టే నాకు కూడా కొన్ని కారణాలు ఉన్నాయి. ఓ రోజున ఆయన మేనేజర్‌కు ఫోన్ చేసి.. ఆ నాలుగు లైన్లు ఇవ్వకపోయినా ఫర్లేదు... ఫోనులో ఒకసారి మాట్లాడమని చెప్పండి అని కోరాం. తద్వారా సమస్య ఏంటి? ఆయన చుట్టూ ఉన్నవారు ఏమైనా చెడుగా చెప్పారా?అనేది తెలుసుకోవచ్చని భావించాం. ఆయన మంచి నటుడు. కోట్లాది మంది అభిమానుల ప్రేమను పొందుతున్నారు.అదే ప్రేమ, గౌరవమర్యాదలను మేము కూడా చూపిస్తున్నాం. కానీ, ఇలాంటి ఒక సమస్య ఉత్పన్నం కావడంతో నేను ముందుకు వచ్చి ఓపెన్ కావాల్సి వచ్చింది' అని నయనతార పేర్కొన్నారు.

20 నిమిషాలు తొలగించినా 'ఏ' సర్టిఫికెట్

● నిర్మాత హారూన్

భరత్, అభిరామి, పవిత్రా లక్ష్మి, అంజలీ నాయర్, కనికా, తలైవాసల్ విజయ్ తదితరులు నటించిన 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ మద్రాస్' మూవీలో 20 నిమిషాల సన్నివేశాలు తొలగించినప్పటికీ సెన్సార్ సభ్యులు 'ఏ' సర్టిఫికెట్ మంజూరు చేశారని నిర్మాతల్లో ఒకరైన హారూన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ నగరంలో జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసి సెన్సార్‌కు వెళ్ళాం. ఖచ్చితంగా 'యూఏ' సర్టిఫికెట్ వస్తుందని భావించాం. కారణం.. స్టోరీ క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో ఉన్నప్పటికీ మద్యం సేవించడం, హింస, అత్యాచారం, బ్లడ్‌బాత్ వంటి సన్నివేశాలు లేవు. అయినా సినిమాను చూసిన సెన్సార్ కమిటీ సభ్యులు 20 నిమిషాల సన్నివేశాలు తొలగించాలని సూచించారు. ఆ ప్రకారంగానే తొలగించాం. అయినప్పటికీ వారు 'ఏ' సర్టిఫికెట్ మంజూరు చేశారు. ఈ విషయంలో మా అభిప్రాయాలను వెల్లడించేందుకు కూడా సమయం ఇవ్వలేదు. ఇటీవలికాలంలో మనుషులను ముక్కలు ముక్కలుగా నరికేసే చిత్రాలు 'యూఏ' సర్టిఫికెట్‌తో విడుదలవుతున్నాయి. మాకు అప్పీల్‌కు లేదా కోర్టుకు వెళ్ళే సమయం, శక్తిసామర్థ్యాలు లేవు. పెద్ద నటీనటులు నటించి ఉన్న చిత్రం అయితే ఇలా చేస్తారా? అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, నూతన దర్శకుడు ప్రసాద్ మురుగన్ రూపొందించిన ఈ హైపర్‌లింక్ మూవీకి జోస్ ఫ్రాంక్లిన్. ఈ నెలాఖరులో విడుదలకానుంది.



పవిత్రా లక్ష్మి - భరత్

భార్యకు విడాకులిచ్చిన కోలీవుడ్ దర్శకుడు

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు శీను రామస్వామి తన భార్యకు విడాకులిచ్చారు. ఈ విషయాన్ని ఆయన గురువారం తన ఎక్స్ ఖాతాలో వెల్లడించి సినీ ప్రముఖులను ఆశ్చర్యానికి గురిచేశారు. 'ప్రియమైన వారికి నమస్కారాలు.. నా భార్య జీఎస్ దర్శన నేను 17 యేళ్ళ వైవాహిక బంధానికి ముగింపు పలుకుతున్నాం. మేమిద్దరం కలిసి, పరస్పర అంగీకారంతో తీసుకున్న నిర్ణయం ఇది. ఇక నుంచి వేర్వేరుదారుల్లో నడవాలని, ఈ క్రమంలో దర్శన ప్రవర్తన నన్నుగానీ, నా వ్యవహారశైలి ఆమెనుగానీ ఏవిధంగానూ అడ్డురావని తెలియజేస్తున్నాను. ఈ విడాకులు మంజూరు చేయాలని మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాం. మా ఇద్దరి వ్యక్తిగత నిర్ణయానికి, ఆ హక్కును గౌరవిస్తూ మీ మద్దతును కోరుతున్నాం' అని పేర్కొన్నారు. దిగ్గజ దర్శకుడు బాలు మహేంద్ర వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన శీను రామస్వామి 2007లో వచ్చిన 'కూడల్ నగర్' అనే సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారు ఆ తర్వాత 'తెన్‌మేర్కు పరువకాట్రు' మూవీతో విజయ్ సేతుపతికి ఓ స్టార్ ఇమేజ్ అందించారు. పిమ్మట 'నీర్ పరవై', 'ధర్మదురై', 'కన్నే కలైమానే', 'మామనిదన్', 'కోళిపన్నై చెల్లదురై' వంటి హిట్ చిత్రాలను నిర్మించారు. అలాగే, ఈయన దర్శకత్వం వహించిన 'ఇడిముళక్కం', 'ఇడం పొరుల్ ఏవల్' సినిమాలు విడుదలకు నోచుకోలేదు.



శీను రామస్వామి

చిత్రజ్యోతి

75వ పడిలోకి సూపర్‌స్టార్

● వెల్లువెత్తిన శుభాకాంక్షలు

● సినీ, రాజకీయ ప్రముఖుల ట్వీట్స్



అడయార్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ గురువారం తన 75వ పడిలోకి అడుగుపెట్టారు. అయితే, రజనీ తన జన్మదినాన చెన్నై నగరంలో లేరు. ప్రస్తుతం ఆయన తన కొత్త చిత్రం షూటింగు కోసం రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఉన్నారు. ఇదిలావుంటే, రజనీకాంత్ పుట్టిన రోజును పురస్కరించుకుని సినీ రాజకీయ ప్రముఖులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. 'హద్దులు లేని సూపర్‌స్టార్ తన నటనతో, స్టైల్‌తో అందరినీ అలరిస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు అని ముఖ్యమంత్రి స్టాలిన్ బర్త్‌డే విషెస్ తెలిపారు. 'తన వ్యక్తిగత చరిష్మాతో కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న తన స్నేహితుడు రజనీకాంత్‌కు హృదయపూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు అని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి పేర్కొన్నారు. 'ప్రియమైన, గౌరవనీయులైన సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు హృదయపూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు అని హీరో విజయ్ ట్వీట్ చేశారు. 'ప్రియ స్నేహితుడు సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు. మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషకరమైన జీవితంతో నిండు నూరేళ్ళు జీవించాలి' అని అగ్రనటుడు కమల్ హాసన్ ట్వీట్ చేశారు. అదేవిధంగా నటి రాధికా శరత్ కుమార్, సినీ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, కేంద్ర మాజీ మంత్రి జీకే వాసన్ తదితరులు రజనీకాంత్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

పళనిలో నేడు కార్తీక దీపోత్సవం

● స్వర్ణరథం ఊరేగింపు రద్దు



చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మురుగప్పెరుమాన్ కొలువైన ఆరుదివ్యక్షేత్రాల్లో మూడవ క్షేత్రమైన పళని దండాయుధపాణి ఆలయంలో శుక్రవారం కార్తీక మహాదీపోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలు 7వ తేదీ కంకణధారణతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ సాయంత్రం షణ్ముఖార్చన, షణ్ముఖ దీపారాధన, యాగ పూజలు, స్వర్ణరథం ఊరేగింపు నిర్వహించారు. ఆరో రోజైన గురువారం సాయంత్రం భరణి దీపం వెలిగించారు. ఆ సమయంలో మూలవిరాట్టు సన్నిధిలో, ఆలయం నాలుగు వైపులా దీపాలు వెలిగించారు. శుక్రవారం కార్తీకమహా దీపోత్సవం సందర్భంగా చొక్కపానై (తాటియాకులను కుండ రూపంలో కట్టి) దహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నాలుగు గంటలకు విశ్వరూప దర్శనం, సాయంత్రం 4 గంటలకు మలిసంధ్య పూజలు నిర్వహించనున్నారు. చొక్కపానై దహనం కార్యక్రమం జరుగనుండటంతో శుక్రవారం ఆలయంలో స్వామివారి స్వర్ణరథం ఊరేగింపు రద్దు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్తీక మహాదీపోత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటికే పళనిలో భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు రానుండటంతో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు పళనిపర్వతాలయంపై భక్తులను అనుమతించమన్నారు. పర్వతాలయానికి వెళ్లే భక్తులు యానైపాదై, కిందకు దిగటానికి పట్టిపాదైని ఉపయోగించుకోవాలన్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మారిముత్తు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి తదితర అధికారులు భక్తులకు తగు సదుపాయాలు కల్పిస్తున్నారు.

వైభవంగా మాసానియమ్మన్ ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకం వేడుకల్లో పాల్గొన్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, సెంథిల్‌బాలాజీ

చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లా ఆనైమలైలోని సుప్రసిద్ధ మాసాన్నియమ్మన్ ఆలయ మహాకుంభాభిషేకం గురువారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆలయంలోనే అమ్మవారు శయనభంగిమలో దర్శనమిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14 యేళ్ల తర్వాత జరిగే ఈ ఆలయ కుంభాభిషేక వేడుకలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం 7.35 గంటలకు ఆరో కాల పూజ, 8.45 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 9.15 గంటలకు మాసానియమ్మన్ ఆలయ విమానం, రాజగోపురం, పరివారమూర్తులకు కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ విమానం, రాజగోపురాలకు ఆలయ ప్రధార్చకులు పవిత్ర నదీ జలాలతో సంప్రోక్షణ చేశారు. ఈ వేడుకలలో మంత్రులు పీకే శేఖర్‌బాబు, సెంథిల్‌బాలాజీ, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్, కోవై జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాడి, ముఖ్యమంత్రి స్టాలిన్ అల్లుడు శబరీశన్ తదితరులు పాల్గొన్నారు.

'టాలెంట్ హంట్' విజేతలకు బహుమతుల ప్రదానం



చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కైవైఎన్ (నో యువర్ నైబర్ హుడ్) సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 'టాలెంట్ హంట్' విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఔత్సాహికులు ఈ సందర్భంగా నృత్యం, గానం, మైమహ, స్టాండ్ అప్ కామెడీ, మిమిక్రీ, రీల్స్ పోటీలు, ఫ్యాషన్ షో వంటి 40 రకాల విభిన్న ప్రదర్శనలను గావించారు. ఇందులో ప్రత్యేక ప్రతిభా పాటలతో ఆకట్టుకోవడంతో పాటు విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. ప్రముఖ నటి యాషికా ఆనంద్, డ్యాన్స్ మాస్టర్ శ్రీధర్, ప్లేబాక్ సింగర్ దేవన్ ఏకాంబరం, రోషిణి, కొరియోగ్రాఫర్ కరుణ్ రామన్ తదితరులు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

డాక్టర్ వి.మోహన్‌కు ఐడీఎఫ్ గౌరవ ఫెలోషిప్



చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ డయాబెటాలజిస్ట్, 'డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్', 'మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్' ఛైర్మన్ డాక్టర్ వి.మోహన్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ (ఐడీఎఫ్) గౌరవ ఫెలోగా ఎంపికయ్యారు. ప్రపంచ మధుమేహ సమాజంలో మధుమేహ సంరక్షణ, పరిశోధన, న్యాయవాద రంగంలో అత్యుత్తమ సేవలందించిన వ్యక్తులకు ఈ గౌరవనీయమైన అవార్డును అందజేస్తారు. ఈ ఫెలోషిప్ పొందినవారిలో భారత్ తరపు నుంచి ఇద్దరుండగా, అందులో ఒకరు డాక్టర్ వి.మోహన్ కావడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐడీఎఫ్ నుంచి ఈ గుర్తింపు పొందడం గర్వంగా వుందని పేర్కొన్నారు.

● వదలని వాయు'గండం'

రోడ్లపైకి నీరు.... నగరవాసుల బేజారు



వడపళనిలో రోడ్డు మీద వరద నీరు



వండడుగుల రోడ్డులో నిలిచిన వరదనీరు

చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం మన్నార్ జలసంధి తీరం వైపు దూసుకురావటంతో రాష్ట్రమంతటా బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం సాయంత్రం వరకూ భారీ వర్షం కురిసింది. రాజధాని నగరం చెన్నైలో జనజీవనం స్తంభించింది. ఈ రెండురోజుల వర్షానికి పూండి, సాత్తనూరు, చెంబరంబాక్కం జలాశయాల్లో నీటిమట్టం ప్రమాద స్థితికి చేరుకుంది. రాష్ట్రంలోనే కాకుండా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉదయం నుంచే వర్షాలు కురిశాయి కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, పుదుకోట జిల్లాల్లో కొన్ని చోట్ల, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ వర్షాలు కురిశాయి. శివగంగ, రామనాథపురం, తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు, కళ్ళకురిచ్చి, విల్లుపురం, చెంగల్పట్టు, కాంచీపురం, చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లో కూడా కొన్ని చోట్ల భారీగా వర్షాలు కురిశాయి. చెన్నైలో బుధవారం సాయంత్రం తేలికపాటి జల్లులతో ప్రారంభమైన వర్షం రాత్రి తొమ్మిది గంటల తర్వాత ఊపందుకుంది. పలుచోట్ల అర్ధరాత్రి నుండి భారీగా వర్షాలు కురిశాయి. దీంతో ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారులలో వర్షపునీరు వరదలా ప్రవహించడంతో వాహన చోదకులు తంటాలు పడ్డారు. నగరంలోని గిండి, కోయంబేడు, మధురవాయల్, వడపళని, టి.నగర్, సైదాపేట, అడయార్, ఎగ్మూరు, కోడంబాక్కం, నుంగంబాక్కం, చేపాక్, ట్రిప్లికేన్, పురుషవాక్కం, నెర్క్రుండం, వానగరం, రెడ్‌హిల్స్, అంబత్తూరు, మనలి, తిరువొత్తియూరు, వాషర్‌మెన్‌పేట, తండయార్‌పేట, రాయపురం, వ్యాసార్పాడి, పెరంబూరు, తాంబరం, క్రోంపేట తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. నగరంలో 53 మి.మీల దాకా వర్షం కురిసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు.



జోరుగా కురుస్తున్న వర్షం



వాన నీటిలో విద్యార్థినులు



శాంతోం హై రోడ్డులో వరద నీటిలో ప్రయాణికుల ఇక్కట్లు









మెరీనాలో ఈదురు గాలులకు కొట్టుకొచ్చిన మరబోట్లు - వరదలోనే కూరగాయల దుకాణాలు - వర్షం కురుస్తున్నా రోడ్కెక్కాల్సిందే..



రామేశ్వరంలో ఎగసిపడుతున్న అలలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సముద్రంలో వీస్తున్న బలమైన ఈదురుగాలుల కారణంగా అలల ఉధృతి అధికమైంది. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రామేశ్వరం, పాంబన్, మండపం ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 45 కి.మీ వేగంతో గాలులు వీస్తుండడంతో, తీరప్రాంతాల్లో అలల ఎగసిపడుతున్నాయి. ఈ కారణంగా రామేశ్వరం ప్రాంత జాలర్లు చేపల వేటకు వెళకూడదని అధికారులు హెచ్చరించారు. అలాగే, రామేశ్వరం ఆలయ అగ్నితీర్థం సముద్ర ప్రాంతానికి భక్తులు వెళ్లకుండా పోలీసులు గస్తీ చేపట్టారు. పాక్ జలసంధి సముద్రంలో మరో రెండు రోజులు సముద్రం అల్లకల్లోలంగా ఉంటూ బలమైన గాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

పురుష ముని వాహనంలో అన్నామలైయార్



వేలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాల్లో భాగంగా 9వ రోజైన గురువారం ఉదయం అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు పురుష ముని వాహనంలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే, వినాయకుడు మూషిక వాహనం, వెండి నెమలి వాహనంలో వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, వేర్వేరు వాహనాల్లో చండికేశ్వరుడు, పరాశక్తి అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. నగరంలో భారీవర్షం కురుస్తున్నా వేలాది మంది భక్తులు తడుస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు - పురుష ముని వాహనంలో అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవారు

శరద్‌పవార్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్‌పవార్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం 84వ జన్మదినం జరుపుకున్న శరద్‌పవార్‌కు శుభాకాంక్షలు చెబుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో... ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రజా జీవితంలోను, దేశాభివృద్ధిలో మీ అపారమైన కృషి గొప్ప ప్రేరణ. మీ స్థిర నాయకత్వం కొనసాగాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని' సీఎం పోస్ట్ చేశారు.

వైభవంగా నాగూరు దర్గా చందనోత్సవం

టి.నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా నాగూరు ఆండవర్ దర్గాలో 468వ చందనోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి చందనపు గూడు ఊరేగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నాగూరు ఆండవర్ దర్గాలో వార్షిక చందనోత్సవాలు ఈ నెల రెండున పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 9 రాత్రి బాణసంచా వేడుకలు, 10న పీర్ల ఏర్పాటు కార్యక్రమాలు వరుసగా నిర్వహించారు. ఈ వేడుకలలో ప్రధాన ఘట్టమైన చందన తాపడ మహోత్సవం గురువారం వేకువజామున జరిగాయి. బుధవారం రాత్రి చందనపు గూడు ఊరేగింపు నాగపట్టినం అభిరామి అమ్మవారి ఆలయం ముందు ప్రారంభమైంది. అక్కడి డప్పు వాయిద్యాలతో బయలుదేరిన చందనపు గూడు ఊరేగింపు ప్రధాన వీధులు మీదుగా కొనసాగి నాగూరు చేరింది. దారి పొడవునా అన్ని మతాల ప్రజలంతా చందనపు గూడుపై పుష్పాలు చల్లారు. చందనపు గూడు నాగూరు చేరుకోగానే అక్కడి సామూహిక పాత్తికామండపంలో పాత్తికా పఠించారు. అక్కడి నుంచి నాగూరు పెద్ద బజారు వీధి, కుంజాలి మరక్కాయర్ వీధి, నూలు కడై వీధికి చందనపు గూడు చేరింది. అక్కడే వంశపారంపర్యంగా చందనపు కలశాన్ని సమర్పించే భక్తుడి ఇంటి నుండి చందనపు కలశాన్ని తీసుకొచ్చి చందనపు గూడులో ఉంచారు. తర్వాత ఆ చందనపు గూడు ఊరేగుతూ చందన మహల్ చేరింది. అక్కడి నుంచి దర్గా లోపలకు తీసుకెళ్ళారు. గురువారం వేకువజాము దర్గాలోని ఆండవర్ సమాధికి చందన తాపడ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. డీఎస్పీ అరుణ్‌కపిలన్ స్వీయ పర్యవేక్షణలో సుమారు 1200 మంది పోలీసులు భక్తులకు భద్రతా ఏర్పాట్లు కల్పించారు.



ఊరేగింపులో భక్తులు



విద్యుద్దీపకాంతుల్లో దర్గా





వానలోనే చక్రతీర్థ ముక్కోటి

తిరుమలలో జోరున కురుస్తున్న వానలోనే గురువారం చక్రతీర్థ ముక్కోటి జరిగింది. కార్తీక సమయంలో దీనిని ఆనవాయితీ. ఉదయం వానలోనే మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుంచి చక్రతీర్థానికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ చక్రత్తాళ్వారుకు, నరసింహస్వామికి, అంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



హ్యాపీ బర్త్‌డే రజనీకాంత్

ప్రసిద్ధ నటి రాధిక తిరుమల నుంచి నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న రజనీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో రాధిక దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రజనీకాంత్ ఆరోగ్యంతో ఉండాలని స్వామి సన్నిధి నుంచి కోరుకుంటున్నానన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

దర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.88 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,887
తలనీలాలు సమర్పించినవారు: 25,725



గోగర్భం డ్యాం నుంచి విడుదల చేసిన నీరు

తిరుమలలో దంచికొట్టిన వాన


నిండిన జలాశయాలు

తిరుమలలో వాన ముంచిపోసింది. గురువారం వేకువజామున జల్లులతో మొదలైన అర్ధరాత్రి వరకు ఏకధాటిగా కురిసింది. శ్రీవారి ఆలయం ముందూ, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. . లోతట్టుప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దర్శనానికి వెళ్లేవారూ, బయటకు వచ్చేవారూ కూడా తడిచి ముద్దయ్యారు. గదులు లభించని భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, షెడ్లు, కార్యాలయాల ముందే చలికి ముడుచుకుని ఉండిపోయారు. వాన కారణంగా సాయంత్రం ఆలయం ముందు నిర్వహించే సహస్రదీపాలంకరణసేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240 (లక్షల గ్యాలన్లు)	నిండిపోయి గేట్లు ఎత్తివేత
కుమారధార	4,258	4,005
పసుపుధార	1,287	1,100
గోగర్భం	2,833	నిండిపోయి గేట్లు ఎత్తివేత
ఆకాశగంగ	685	నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతోంది





ఆకాశగంగ గేట్లు ఎత్తిన దృశ్యం - నిండుకుండలా ఆకాశగంగ

నిండిన జలశయాలు : తిరుమలలోని గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం డ్యాములు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. పాపవినాశనం, గోగర్భం డ్యాముల గేట్లును ఎత్తివేయగా, ఆకాశగంగా డ్యాం నుంచి నీరు ఓవర్‌ఫ్లో అవుతోంది. కుమారధార, పసుపుధార డ్యాముల్లోకి 90 శాతం నీరు చేరింది. శుక్రవారం వేకువజామున ఇవి కూడా నిండిపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నిల్వలతో రానున్న 350 రోజులకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు అందుబాటులోకి వచ్చింది. తిరుమల అవసరాలకు ప్రతిరోజు 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఇందులో 20 లక్షల గ్యాలన్లు తిరుమల డ్యాముల నుంచి మరో 30 లక్షల గ్యాలన్లు కల్యాణిడ్యాం నుంచి తీసుకుంటారు. గత మూడు నెల క్రితం వరకు కూడా తిరుమలలో నీటి ఇబ్బందులు వస్తాయని టీటీడీ అధికారులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంలో నీటి వినియోగంలో కొన్ని ఆంక్షలు కూడా విధించారు. అయితే తాజా వానలతో జలాశయాల్లోకి నీరునిండుగా చేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పాపవినాశనం, శ్రీవారిపాదాలకు నో ఎంట్రీ

ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, జపాలి, వేణుగోపాలస్వామి ఆలయం, ఆకాశగంగ, శ్రీవారిపాదాలు, శిలాతోరణం మార్గాలను టీటీడీ గురువారం ఉదయం మూసివేసింది. అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాలలో భక్తులు జాగ్రత్తగా వెళ్లాలంటూ విజిలెన్స్ సిబ్బంది సూచనలు చేస్తున్నారు.



రెండో ఘాట్‌లో జారిన బండ

రెండవ ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. మార్గంలోని హరిణి విశ్రాంతి షెడ్‌కు సమీపంలో ఓ భారీ బండరాయితో పాటు మట్టి, చిన్నపాటి రాళ్లు రోడ్డుమీదకు జారాయి. ఆ సమయంలో వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజినీరింగ్ అధికారులు జారిన కొండచరియలను వేగంగా తొలగించారు. రెండు ఘాట్ రోడ్లలోనూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను మూడు బృందాలు పరవేక్షిస్తున్నాయి.



లీలామహల్ వద్ద భారీ వర్షాలతో ప్రజలకు అవసరమైన సూచనలు ఇస్తున్న డీఎస్పీ

వాగులు..వంకల వద్ద పోలీసు పహారా : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎవ్వరూ అనవసరంగా బయటకు రావద్దని, వాగులు, వంకల్లో చిక్కుకుని ఇబ్బందులు పడవద్దని ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112 లేకుంటే 8099999977కు వాట్సాప్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. అండర్ బ్రిడ్జిల కింద నిర్లక్ష్యంగా వెళ్లరాదన్నారు. తిరుపతిలో దాదాపు 12 ప్రాంతాలు జలమయమయ్యాయని, పోలీసులు దగ్గరుండి పరిస్థితులను సమీక్షిస్తున్నారని తెలిపారు. కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే చోట ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ఆస్థి, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాళంగి 10 గేట్లు ఎత్తివేత

కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కాళంగి జలాశయం నిండుతోంది. జలాశయం సామర్థ్యం 240 అడుగులు కాగా ప్రస్తుతానికి 225 అడుగులు చేరింది దీంతో పది గేట్లను 8 అడుగుల చొప్పున ఎత్తి నీటిని దిగువకు వదిలినట్లు ఏఈ బాబు తెలిపారు. జలాశయంలోకి 9,200 క్యూసెక్కుల నీరు చేరుతుండగా గేట్ల ద్వారా 10,080 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రధాన గేట్ల వద్ద 198 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉందన్నారు. ఇంకా పెరిగే అవకాశముంటే మరిన్ని గేట్లు ఎత్తుతామని వివరించారు.

కొట్టుకుపోయిన వంతెన

కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజులకండ్రిగ సమీపంలో పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన వర్షాలకు కొట్టుకుపోయింది. విద్యార్థులు ప్రవాహం తక్కువగా ఉన్న సమయంలో కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాలకు, రాజులకండ్రిగలోని ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. అయితే అధికారులు స్కూళ్లకు ఆలస్యంగా సెలవు ప్రకటించడంతో విద్యార్థులు వర్షంలోనే తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది. ఆ సమయంలో ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక యువకులు వారిని దగ్గరుండి ఏరు దాటించారు. ఇది గమనించిన సర్పంచు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరూ ఏరు దాటకుండా సిబ్బందిని కాపలా పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో పసికందు సహా ముగ్గురి మృతి



ఘటనలో ధ్వంసమైన కారు ముందు భాగం

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోవై సమీపంలో టెంపో-కారు ఢీకొన్న ఘటనలో 2 నెలల పసికందు సహా ఒకే కుటుంబానికి చెం దిన ముగ్గురు మృతిచెందారు. కేరళ రాష్ట్రం పాతానందిట్ట జిల్లాకు చెందిన జాకబ్ అబ్రహాం (60), భార్య షీబా (55), కోడలు ఎలానా థామస్ (30), మనవడు ఆరాన్ (2 నెలలు) తదితరులతో గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సేలం-కొచ్చిన్ జాతీయ రహదారి మీదుగా బెంగళూరు వైపుకు వెళ్తున్నారు. జాకబ్ అబ్రహాం నడుపుతున్న కారు బోడిపాళయం సమీపంలో హఠాత్తుగా అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టెంపోను వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో జాకబ్ అబ్రహాం, షీబా, మనవడు ఆరాన్ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ఎలానా థామస్‌ను చుట్టుపక్కలవారు రక్షించి కోవైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లాలి

- ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ
- ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే
- కోడింగ్‌లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతి అందజేత







సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ - విజేతలకు చెక్కు అందిస్తున్న ఐఐటీ అధికారులు - విద్యార్థుల సంబరాలు

ఏర్పేడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి దేశం సిద్ధంగా ఉందని, ఇండియా ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లడానికి విద్యార్థులు కృషి చేయాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. ఐఐటీ తిరుపతిలో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ 2024 ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా ఆవిష్కరణలు దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటే విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం అద్భుతమైన విజయం సాధించిందని ముఖ్య అతిథి స్విమ్స్ వైస్ చాన్సలర్ ఆర్‌వీ కుమార్ అన్నారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్‌కుమార్ గుంజు మాట్లాడుతూ విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన 51 మోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ చేరడం గర్వకారణంగా ఉందని చెప్పారు. తిరుపతి ఐఐటీలో డిసెంబరు 11 నుంచి 12 వరకు రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే జరిగింది. ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించిన వాస్తవ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి దేశంలోని వివిధ ప్రతిష్టాత్మక కళాశాలల నుంచి 21 బృందాలు పాల్గొన్నాయి. బుధవారం ఉదయం 9.30 నుంచి గురువారం సాయంత్రం 5.30 గంటలు 36 గంటల పాటు నిరంతరాయంగా పోటీ జరిగింది.

కోడింగ్ విజేతలు వీరే..

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతిలో ఉపయోగించే విభిన్న శ్రేణి ఔషధ మొక్కలను ప్రదర్శిస్తూ వినియోగదారులకు ఇంటరాక్టివ్ ఎడ్యుకేషన్, లీనమయ్యే అనుభవాన్ని అందించే వర్చువల్ హెర్బల్ గార్డెన్‌ను సృష్టించాలని విద్యార్థుల బృందాలకు సూచించింది. ఆయుష్ రంగంలో స్టార్టప్‌ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి రిజిస్ట్రేషన్ పోర్టల్ సామర్థ్యం పారదర్శకతను మెరుగుపరచడానికి అవసరమైన ప్రణాళికలను కోడింగ్ చేయాలని విద్యార్థులకు సూచించింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన స్టాక్ స్క్వాడ్ విద్యార్థుల బృందం, ఆర్‌ఎంకే ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రగతి మిత్ర గ్రూప్‌నకు చెందిన విద్యార్థుల బృందం, కోడ్ క్రాఫ్టు విద్యార్థుల బృందం విజేతలుగా నిలిచాయి. పుణేకు చెందిన ఆర్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన కార్బన్ డేటర్స్ విద్యార్థుల బృందం, మహారాష్ట్రకు చెందిన కేకే వాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థుల బృందం సంయుక్తంగా విజేతలుగా నిలిచారు.

కల్కి ఆశ్రమం నుంచి మా భూములు అప్పగించండి!

- హైకోర్టును ఆశ్రయించిన రైతులు

వరదయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాలెం మండలంలోని కల్కి ఆశ్రమం స్వాధీనంలో ఉన్న తమ భూములను అప్పగించాలంటూ పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వరదయ్యపాలెం మండలం చెదుళ్లపాకం రెవిన్యూ గ్రామ పరిధిలో పులి పోలయ్య, చంద్రశేఖర్, నీలమ్మ, సలవాది రాము అనే వారికి గతంలో ప్రభుత్వం ఆరు ఎకరాల సీలింగ్ భూములను కేటాయించింది.వాటికి అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేసింది. అయితే 2008లో వీరు హైకోర్టును ఆశ్రయించి ప్రభుత్వం తమకు కేటాయించిన అసైన్‌మెంట్ భూములను కల్కి ఆశ్రమ నిర్వాహకులు ఆక్రమించుకుని ఆశ్రమంలో కలిపేసుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.తమ భూముల్ని తమకు అప్పగించాలని కోరారు. అయితే పిటిషనర్ల తరపు ఎవరూ కోర్టులో వాదించకపోవడంతో సుదీర్ఘకాలం వేచి చూసిన హైకోర్టు ఈ ఏడాది జనవరిలో ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. 2008లో తాము దాఖలు చేసిన కేసును నడిపించే ఆర్థిక స్థోమత తమకు లేకపోయిందని, అందువల్ల కేసు నడపలేకపోయామని తాజాగా మరోసారి పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించి తమ భూములను తిరిగి ఇప్పించాలని వారు తాజాగా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు. రిట్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు నాలుగు వారాలకు కేసును వాయిదా వేసింది.

ప్రమాదస్థితిలో పూండి రిజర్వాయర్

చెన్నై, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి నుండి గురువారం ఉదయం వరకూ కురిసిన భారీ వర్షాలకు తిరువళ్లూరు జిల్లా పూండిలోని సత్యమూర్తి జలాశయం ప్రమాదస్థితికి చేరింది. ఆ జలాశయం పూర్తి సామర్థ్యం 35 అడుగుల కాగా, ప్రస్తుతం నీటిమట్టం 34.05 అడుగులకు పెరిగింది. ఆరణియార్ ప్రాజెక్టు నుండి విడుదలైన జలాలు కూడా ఈ రిజర్వాయర్‌లో ప్రవేశించడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పూండి జలాశయానికి చేరువగా ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలకు, కుశస్థలివాగు సమీపంలో ఉన్నవారికి తొలివిడత వరద హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ జలాశయం నుండి సెకనుకు వెయ్యి ఘనపుటడుగుల చొప్పన జలాలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కుశస్థలివాగుకు చేరువగా ఉన్న ఆట్రంబాక్కం, ఒదప్పై, నైవేలి, ఎరయూరు, భీమన్‌తోప్పు, సోమదేవన్‌పట్టు, మెయ్యూరు, తామరైపాక్కం, ఆత్తూరు, జగన్నాథపురం ప్రాంతంలో నివసిస్తున్నవారంతా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు హెచ్చరించారు.

80 శాతం నిండిన చెంబరంబాక్కం...

గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నగర ప్రజలకు తాగునీరందించే చెంబరంబాక్కం జలాశయం నీటిమట్టం 80 శాతానికి పెరిగింది. ఆ జలాశయం పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, పూండి జలాశయం నుండి విడుదలైన జలాలతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఇన్‌ఫ్లో పెరగటంతో జలాశయం 24 గంటల్లో పూర్తిగా నిండే అవకాశం ఉందని, అదే జరిగితే వరద హెచ్చరికలు జారీ చేయాల్సి వస్తుందని ఇరిగేషన్ విభాగం అధికారులు తెలిపారు.

సాత్తనూరు జలాశయం...

తిరువణ్ణామలై జిల్లా సాత్తనూరు జలాశయంలో నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరనుంది. ఆ జలాశయం పూర్తి సామర్థ్యం 119 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 117.75 అడుగులకు చేరింది. తెన్‌పెన్నైయారు సమీపంలో ప్రాంతాల ప్రజలకు మళ్ళీ వరద హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం ఆ జలాశయం పరివాహక ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నీటిమట్టం ప్రమాద స్థితికి చేరనుండటంతో గురువారం రాత్రి లేదా శుక్రవారం ఉదయం జలాశయం నుండి అదనపు జలాలను భారీ స్థాయిలో విడుదల చేసే అవకాశం ఉంది. సాత్తనూరు జలాశయంలో అదనపు జలాలను సెకనుకు 50వేల ఘనపుటడుగులకు మించి విడుదల చేస్తే తిరువణ్ణామలై, కళ్ళకురిచ్చి, విల్లుపురం, కడలూరు జిల్లాల్లో మళ్ళీ వరద పరిస్థితులు ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు.

మరో నాలుగు జిల్లాలకు సంచార నేత్ర చికిత్సా యూనిట్లు

పెరంబూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మల్టీపర్పస్ జిల్లా సంచార కంటి చికిత్స యూనిట్లు ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ అడిషినల్ ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన ప్రకటనలో.. 50 ఏళ్లు పైబడిన వారిలో ఏర్పడే దృష్టిలోపం జాతీయస్థాయిలో సరాసరిన 1.99 శాతం ఉండగా, రాష్ట్రంలో 1.18 శాతం ఉందన్నారు. దృష్టిలోపం తగ్గించడంలో రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. అయినప్పటికీ, కంటి శుక్లం, మధుమేహం వల్ల కలిగే రెటీనా సమస్యలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దృష్టిలోపంతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోందని, వాటిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్య పరిష్కరించేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సంచార కంటి చికిత్సా యూనిట్లు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ సంచార యూనిట్ల ద్వారా వక్రీభవన లోపాలు, కంటి శుక్లం, గ్లకోమా, డయాబెటిక్ రెటినోపతి, ఇతర కంటి సంబంధిత వ్యాధుల కోసం ఆన్-సైట్ స్క్రీనింగ్ సేవలు అందిస్తాయని తెలిపారు. ప్రతి రోజు చివరలో చికిత్స అవసరమయ్యే బాధితులను ఈ వాహనం ద్వారా ప్రభుత్వ కంటి ఆస్పత్రులకు తీసుకెళ్తామన్నారు. తొలుత సేలం, రామనాథపురం, తిరువళ్లూర్, కడలూరు, కరూర్, నాగపట్టణం, తంజావూరు, తిరువణ్ణామలై, మదురై, కన్నియాకుమారి, నీలగిరి తదితర 11 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రస్తుతం ధర్మపురి, మైలాడుదురై, కృష్ణగిరి, తిరువారూరు జిల్లాలకు విస్తరించనున్నామన్నారు. ఒక్కో యూనిట్ రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటుచేయనున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

రెండు ప్రాంతాల్లో 'హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టులు'

ఐసిఎఫ్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. ఈ కేంద్రాల్లో గాలులు, సౌరశక్తి వినియోగించి వంద మెగావాట్ల విద్యుదుత్పత్తి జరపాలని నిర్ణయించారు. రాష్ట్రంలో పవన, సౌర, అణు, థర్మల్, జల విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ క్రమంలో, రాష్ట్ర గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గాలులు, సౌరశక్తి మిశ్రమంతో విద్యుదుత్పత్తి చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై సమగ్ర పరిశోధన అనంతరం, తూత్తుకుడి, కన్నియాకుమారిలో ఈ మిశ్రమ విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఈ విషయమై గ్రీన్ ఎనర్జీ అందజేసిన నివేదిక ఆధారంగా, రాష్ట్రంలో హైబ్రీడ్ పవర్ జనరేషన్ కేంద్రాల ఏర్పాటుకు నేషనల్ విండ్ ఎనర్జీ కార్పొరేషన్ అనుమతులు జారీచేసిందని అధికారులు తెలిపారు.

రైల్వేలో మజ్దూర్ యూనియన్, సంఘ్‌లకు గుర్తింపు

తిరుపతి(సెంట్రల్)డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రైల్వేలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వేలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లకు గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా ఈనెల 4, 5, 6, తేదీల్లో రైల్వేలో పోలింగ్ జరిగింది. గురువారం లెక్కింపు చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో 78,434 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మజ్దూర్ యూనియన్ 32,371ఓట్లతో 47.46 శాతం, ఎంప్లాయిస్ సంఘ్ 29,266 ఓట్లతో 42.91 శాతం సాధించి అర్హత సాధించాయి. మిగిలిన డీఎంఆర్‌కేఎస్ 5,634 ఓట్లతో 8.26 శాతం, ఐఆర్‌ఎంయూ 286 ఓట్లతో 0.42శాతం, ఆర్‌ఎంయూ 654 ఓట్లతో 0.96 శాతం సాధించాయి. దీంతో ఈ మూడు సంఘాలను పరిగణనలోకి తీసుకోలేదు. గుంతకల్లు డివిజన్‌లో ఎంప్లాయిస్ సంఘ్ 243 ఓట్లతో పైచేయి సాధించింది. దీనిపై సంఘ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలి

- విజయశంకర్‌స్వామి -



మాట్లాడుతున్న అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి

తిరుపతి (జీవకోన), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల మాడవీధుల విస్తరణలో భాగంగా కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, లేనిపక్షంలో ఫిబ్రవరి 22న ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని మంగళం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, తొలగించిన హనుమంతుడి విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించాలని కోరుతూ పుణ్యక్షేత్రాలు తిరిగి భక్తుల సంతకాలు సేకరించి టీటీడీకి సమర్పించామన్నారు. అన్నమయ్య గృహ సాధన సమితి, జై భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ డిమాండ్లపై పోరాడుతున్నామన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో నిత్య హరినామ సంకీర్తన జరగాలని, అప్పుడే పూర్తిస్థాయిలో తిరుమల పుణ్యక్షేత్రం ప్రక్షాళన అవుతుందన్నారు. భక్తి గీతాలు నేర్పించే గురువులకు టీటీడీ గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞానియోధ లోకనాథ్, ఖదిజ్ఞాని మల్లికావల్లభ, ఖదిజ్ఞాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని రైతులందరికి చేర్చాలి

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు



అవార్డులు అందిస్తున్న ఇన్‌చార్జి వీసీ జేవీరమణ, డీన్ వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతి రామయ్య

తిరుపతిరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని గ్రామీణ స్థాయిలో రైతుల దరికీ అందించి వారి అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ యువపరిశోధకులకు సూచించారు. వెటర్నరీ కళాశాల వేదికగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పశు వులకు సంబంధించిన పలురకాల వ్యాధులు, వాటి నియంత్రణకు వినియోగించే మందులు, వ్యాధి నిర్ధారణ సాంకేతికత, ఆధునిక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, పశుసంపద పెంపునకు కృషిచేయాలని ఆకాంక్షించారు. వెటర్నరీడీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రతిఏటా వర్సిటీలో జాతీయస్థాయి సదస్సుని నిర్వహించి, దేశంలోని పశువైద్యవిద్య పరిశోధకులని గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతిరామయ్య, కో-ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ రాజా పాల్గొన్నారు.

43 ఆర్టీసీ బస్సుల రద్దు

తిరుపతి (ఆర్టీసీ), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 12 మార్గాల్లో ఆర్టీసీ రవాణా స్తంభించింది. వర్షానికి ఏరులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడం, వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో 43 బస్సులను నిలిపివేశారు. తిరుమల ఘాట్ బస్సుల్లోనూ తక్కువ సంఖ్యలోనే ప్రయాణికులు కనిపించారు. సీబీఎస్‌లో నీరు పేరుకుపోవడంతో తూముల్లో పూడికతీసి బయటకు పంపే ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ రవాణా ఆగిన మార్గాలు.. బస్సులు : తిరుమల పాపవినాశనం 8, సీతకాలువ 1, ఉడమలపాడు 2, అమ్మపల్లిడ్యామ్ 1, అడవికండ్రిగచెరువు 1, కావనూరు ఏరు 1, కలవకూరుకాలువ 2, గోవర్ధనపురం 9, నారాయణవనం 12, పేర్నాడు 1, పున్నేపల్లి 1, బోయలగడ్డ 4 బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి.